నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | జనవరి 12, 2025 | www.navatelangana.com

రైతుల ఖాతాల్లో రూ.166కోట్ల24 లక్షలు జమ

• జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 319 వరి ధాన్యం కొనుగోలు ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి రూ.166 కోట్ల 24 లక్షల నగదు సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేశామని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన 326 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 319 కొనుగోలు కేంద్రాల ద్వారా లక్షా18 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇందులో 41వేల132 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం ఉందని, సంబంధిత 12 వేల 127 మంది రైతుల ఖాతాలలో రూ.166 కోట్ల 24 లక్షల జమ చేశామని తెలిపారు. జిల్లాలో 29 రైస్ మిల్లులకు సిఎంఆర్ అనుమతులు జారీ చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని 314 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తి చేసి మూసేశామన్నారు. జిల్లాలో కొనుగోలు ప్రక్రియ దాదాపు 99శాతం పూర్తయిందని, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అందించిన సన్న రకం ధాన్యం బోనస్‌తో రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

ఎమ్మెల్యే కప్ క్రికెట్ పోటీలను ప్రారంభించిన అనిల్ జాదవ్

బోథ్ : మండలంలోని పొచ్చెర గ్రామంలో హనుమాన్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఫ్రాంచైజీ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-1ను శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలన్నారు. యువకులు మాట్లాడుతూ మొదటి బహుమతి రూ.25000, రెండో బహుమతి రూ.15000 ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను యువకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ ఎంపిపిలు తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్, నాయకులు జాదవ్ గణేష్, శ్రీధర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రశాంత్, స్వామి, రాజు, రమణ, సీతయ్య, చింటూ, ప్రతాప్ పాల్గొన్నారు.



తీరనున్న పరేషాన్..!

- కొత్త రేషన్ కార్డుల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం
- ఈ నెల 26 నుంచి జారీ చేసే అవకాశం
- ఇన్నాండ్లు కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరం
- లబ్దిదారుల ఎదురుచూపులకు తెరదించనున్న సర్కారు

ఉమ్మడి జిల్లాలో రేషన్‌కార్డుల పరేషాన్ తీరనుంది. ప్రభుత్వ కొత్త కార్డుల మంజూరుకు చర్యలు చేపడుతోంది. ఈ నెల 26 నుంచి ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. దీంతో అనేక ఏండ్లుగా రేషన్‌కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న లబ్దిదారుల సమస్య తీరిపోనుంది. ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తున్న దృష్ట్యా రేషన్‌కార్డులకు అధిక ప్రాధాన్యం ఏర్పడింది. ఈ కార్డులు లేక అనేక మంది తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన కార్డుల జారీకి ముందుకు రావడంతో లబ్దిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం వీటికి సంబంధించి విధివిధానాలు రూపొందించే పనిలో నిమగ్నమైంది. ఈ అంశంపై ఇటీవల జరిగిన సీఎం సమీక్షలోనూ రేషన్‌కార్డుల జారీ అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. జిల్లా అధికారులు సైతం ఇందులో పాల్గొనడంతో కార్డుల జారీ ప్రక్రియకు మార్గం సుగుమమైనట్లు తెలిసింది. కార్డుల జారీలో పాత నిబంధనలే వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రేషన్‌కార్డుకు ప్రతి పేద కుటుంబంలో ఎనలేని ప్రాధాన్యం ఉంటుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉండే కుటుంబంగా గుర్తించేందుకు ఈ కార్డులను జారీ చేస్తుంటాయి. కానీ గత ప్రభుత్వం అనేక ఏండ్లుగా ఈ కార్డులు జారీ చేయకపోవడంతో అనేక మంది పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి కుటుంబాల నుంచి విడిగా ఉంటున్న జంటలతో పాటు కొత్తగా పెళ్లైన జంటలు ఈ కార్డుల కోసం ఏండ్లుగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి వారు సుమారు 70వేల నుంచి లక్ష కుటుంబాల వరకు ఉంటారని అంచనా. ఇటీవల ప్రజాపాలనలో దరఖాస్తులకు ప్రభుత్వం అవకాశమివ్వకపోవడం..ఈ కార్డుల కోసం విడిగా దరఖాస్తులు స్వీకరిస్తామని అప్పట్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఈ కార్డులు అత్యవసరం కావడంతో అనేక మంది తెల్లకాగితాలపై దరఖాస్తులు చేసి వీటి ప్రాధాన్యాన్ని తెలియజెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకే ఈ కార్డులు జారీ చేస్తామని పలుమార్లు చెప్పినప్పటికీ వివిధ కారణాలతో జాప్యం జరుగుతూ వచ్చింది. తాజాగా హైదరాబాదులో కలెక్టర్లు, ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి వివిధ పథకాలతో పాటు రేషన్‌కార్డుల జారీపై సమీక్షించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ నెల 26 నుంచి జారీకి శ్రీకారం..!

ప్రభుత్వం ఇప్పటికే పలు పథకాలను ప్రారంభించగా.. మిగిలిన మరికొన్ని పథకాలను సైతం నెల 26 నుంచి ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రేషన్‌కార్డులను సైతం జారీ చేయనున్నట్లు తెలిసింది. ఈ కార్డుల జారీకి గతంలో ఉన్న నిబంధనలే వర్తింపజేయాలని సూచించింది. కాగా ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో 1.91లక్షల రేషన్‌కార్డులు ఉండగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 1.37లక్షలు, మంచిర్యాలలో 2.04లక్షలు, నిర్మల్ జిల్లాలో 2.14లక్షల కార్డుదారులున్నారు. వీటికి అదనంగా కొత్తగా ఒక్కో జిల్లాలో సుమారు లక్ష వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కార్డుల జారీకి ముందు లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలన అనంతరం పేదలకు నూతన కార్డులు జారీ చేయనున్నారు. మరోపక్క గత పదేండ్లుగా కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అనేక మంది పొందలేకపోతున్నారు. ఆరోగ్యశ్రీ చికిత్సలతో పాటు సర్టిఫికేట్లు పొందడంలోనూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేషన్‌కార్డుల జారీలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంపై ఇప్పటికీ లబ్దిదారులు నిరుత్సాహం వ్యక్తం చేస్తుంటారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈకార్డుల జారీకి ప్రాధాన్యం ఇవ్వనుండటంతో ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హులవుతామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రేషన్ కార్డులు జారీ చేయడం సంతోషం :

మంగేష్, శంషాబాద్, బేల మండలం

ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం చాలా సంతోషం. ఇప్పటికే కార్డు లేకపోవడంతో పలు ప్రభుత్వ పథకాలు పొందలేకపోయాం. పథకాలకు అర్హులమై ఉండి కూడా రేషన్‌కార్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నాలుగేండ్ల నుంచి ఎదురుచూస్తున్నాం. ఇప్పటికైనా అందించడం చాలా సంతోషం.

ఈ నెల 26నుంచి కార్డుల జారీ ప్రారంభిస్తాం : వాజీద్ అలీ,

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, ఆదిలాబాద్

ప్రభుత్వం ఈ నెల 26 తేదీ నుంచి కొత్త కార్డులను అందజేయాలని నిర్ణయించింది. అదే రోజున 10శాతం కార్డులు కూడా లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటాం. అర్హులైన అందరికీ నూతన కార్డులు మంజూరు చేస్తాం.

గ్రామాల అభివృద్దే ప్రభుత్వాల ధ్యేయం



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామాల అభివృద్దే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని సాలేగూడ గ్రామంలో రూ.275లక్షల వ్యయంతో నిర్మించనున్న టీడబ్ల్యూపీఎస్ హాస్టల్ భవన నిర్మాణ పనులకు ఎంపీ గోడం నగేష్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఫారెస్ట్ క్లియరెన్స్ ఇప్పించేలా కృషి చేయాలని ఎంపీ గోడం నగేష్ ను కోరారు. పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన రోడ్లు ఫారెస్ట్ సమస్యల కారణంగా రద్దవుతున్నాయని తెలిపారు. దీని మూలంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, దీనికి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ఆదివాసీ తెగలలో అత్యంత వెనుకబడిన పీవీటీజీ గ్రామాల్లో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించి, ఫారెస్ట్ క్లియరెన్స్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పెంబి మండల కేంద్రంలో ఏకలవ్య పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసులకు మెరుగైన విద్యా, వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేసి తక్షణమే పిఆర్‌సి అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజావేణు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కెజిబివి, యుఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా గురుకుల పాఠశాలల సమయసారిణి మార్చాలని, సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో జిల్లా కోశాధికారి బి.కిరణ్, జిల్లా కార్యదర్శులు కె.చంద్రమౌళి, జి.నర్సయ్య, బి. దేవిదాస్, జె.బాపు పాల్గొన్నారు.

ఒడ్డెర కులస్తులపై జిల్లా అధికారులు చిన్నచూపు..!



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఒడ్డెర సంఘంపై, ఒడ్డెర కులస్తులపై జిల్లా అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, తమ బాధలు, సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో చెప్పుకోవడానికి వీలులేకుండా పోయిందని ఒడ్డెర సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారికంగా జరిగే ఒడ్డెర ఓబన్న జయంతి కార్యక్రమాన్ని బైకాట్ చేసి వచ్చామన్నారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ఒడ్డె ఓబన్న జయంతి కార్యక్రమానికి తమకు ఆహ్వానం అందిందని అన్నారు. అక్కడకు వెళితే ఉన్నతస్థాయి అధికారులు ఎవరూలేకపోవడం బాధాకరమన్నారు. అందువల్లనే ఆ కార్యక్రమం నుంచి బయటకు వచ్చేశామని తెలిపారు.

సఖీ కేంద్రం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ శ్రీనగర్ కాలనీలో సఖీ కేంద్రం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు శనివారం శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించారు. కాలనీలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగవల్లులను వేశారు. తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించడంతోపాటు సామాజిక అంశాలపై చైతన్యం కలిగించేలా ముగ్గులు అలరించాయి. అనంతరం బహుమతులను అందజేశారు. సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ శ్వేతారాణి, జె. సవిత. శ్రీనగర్ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా కాన్వెంట్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు

• అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు • హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు, చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాన్వెంట్ పాఠశాల ఈ అరవై ఏండ్లలో అనేక మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దిందని తెలిపారు. విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో ఈ పాఠశాల స్థాపించడం గొప్ప విషయమన్నారు. పేదలకు కూడా ఇందులో చదివే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈఓ వేణుగోపాల్, ఎంఈఓ సోమయ్య, ట్రస్మా అధ్యక్షులు పవన్‌రావు, కాన్వెంట్ పాఠశాల ప్రెసిడెంట్ లిస్‌గ్రెస్, సిఎంఐ జోసెఫ్ మంజలి, ప్రిన్సిపల్ మరియా రోస్, పూర్వ విద్యార్థి ప్రతాప్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





కాంగ్రెస్‌లోకి జనతా ఆటో యూనియన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జనతా ఆటో యూనియన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శనివారం డైట్ కాలేజీ మైదానం నుండి ఆటోలతో ప్రజా సేవాభవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఖాకీ చొక్కా ధరించి కంది డైట్ గ్రౌండ్ నుండి కలెక్టర్ చౌక్ వరకు ఆటో నడిపారు. అనంతరం శ్రేణులు ఆటో యూనియన్ నాయకులతో కలిసి తన క్యాంపు కార్యాలయం వరకు పాదయాత్రగా వచ్చారు. ఆ తర్వాత క్యాంపు కార్యాలయంలో వారందరికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. పాత కొత్త నాయకులు కార్యకర్తలు అంతా కలిసి పార్టీ కోసం పని చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే ప్రతి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాకాయకులు నుస్రత్ ఖాన్, జహీర్ రంజాని, బండారి సతీష్, ఆవుల వెంకన్న, కిజార్ పాషా, శంకరయ్య, లోక ప్రవీణ్‌రెడ్డి, షౌకత్, ఆశన్న, బూర్ల శంకరయ్య, అల్చెట్టి నాగన్న, దాసరి ఆశన్న, బత్తుల శ్రీనివాస్, బండి సుదర్శన్, దీపక్‌రావు, గంగన్న, ప్రకాష్, లింగన్న పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా ఒడ్డే ఓబన్న జయంతి వేడుకలు



నవతెలంగాణ-నిర్మల్

కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఒడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలను వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సంపంగి ప్రభాకర్ మాట్లాడుతూ పీడిత వర్గాల హక్కుల కొరకు పోరాడిన గొప్ప వ్యక్తి ఓబన్న అని తెలిపారు. ఒడ్డెర జాతి వారు ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీనంలో ఉన్నప్పుడు రేనాటి పాలెగాళ్లకు, కంపెనీ పాలెగాళ్లకు చెల్లించే జీతభత్యాల విషయంలో మొదలైన సంఘర్షణ సాయుధ పోరాటంగా మారడంలో ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయిధ పోరాటానికి ఒడ్డే ఓబన్న సైన్యాధ్యక్షునిగా వ్యవహరించారన్నారు. ఇటువంటి పోరాట యోధుల జయంతిని అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇటువంటి వ్యక్తుల జయంతులను అధికారికంగా నిర్వహించడం ద్వారా నేటి తరాలకు వారి పోరాట గాథల్ని తెలిపిన వారిమవుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి శ్రీనివాస్, సహాయ వెనుకబడిన తరగతుల అధికారి సత్యనారాయణరెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు ఖాలిక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఇంటర్న్‌షిప్ విద్యార్థుల నర్సరీ పరిశీలన



ఉట్నూర్ : కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని ఆదిలాబాద్ జిల్లా దస్నాపూర్ హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఐటిడిఏ ఉద్యాన నర్సరీని శనివారం సందర్శించారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా అనుమతితో నర్సరీని పరిశీలించే అవకాశం లభించిందని ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ తెలిపారు. విద్యార్థులు నాలుగు వారాల పాటు ఉద్యాన నర్సరీలోనే ఉండి వివిధ రకాల పంటల సాగు విధానాలపై అధ్యయనం చేయనున్నారు. వీరికి ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్ కుమార్ నర్సరీలో సాగు చేస్తున్న వివిధ పంట క్షేత్రాలపై అవగాహన కల్పించారు. ఉద్యాన నర్సరీలోని పంటలతో పాటు మొక్కల పెంపకం, అంటూ కట్టటం, అలంకరణ మొక్కల తయారీ, రైతు ఉత్పత్తి సంఘాలను పరిశీలించడం, వివిధ రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివిధ రకాల సాగు పద్ధతులను తెలుసుకుంటారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై, వాటికి అవసరమైన పరిష్కారాలను తెలియజేస్తూ ప్రాజెక్టు రిపోర్టును ఉద్యాన విశ్వవిద్యాలయానికి సమర్పించనున్నారు. నెల రోజులు పాటు ఈ అధ్యయనం జరగనుంది. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ, అధ్యాపక సిబ్బంది అశ్విని, చాణక్య, ఉద్యాన నర్సరీ సాంకేతిక అధికారిణి అర్షిత పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి

• నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మున్నూరు కాపు సంఘం అభివృద్ధి కొరకు ప్రతీ కుల సభ్యుడు కృషి చేయాలని నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎంసీ లింగన్న అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన తెలంగాణ మున్నూరు కాపు ఉద్యోగుల, ఉపాధ్యాయుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా సమన్వయ సమావేశానికి నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

హెడ్ స్వచ్ఛంద సంస్థ స్థాపించి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోనీ శ్రీసరస్వతి శిశు మందిర్ విద్యుత్ కార్యాలయం దగ్గర ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు హెడ్ సొసైటీ అధ్యక్షుడు జాదవ్ శ్రీకాంత్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | జనవరి 12, 2025 | www.navatelangana.com

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్, అంబేద్కర్ సర్కిల్, మయూరి సర్కిల్



ఏరియాలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పర్యవేక్షించారు. రోడ్లపై వ్యాపారం చేస్తున్న వారితో మాట్లాడారు. రహదారులపై వాహనాలు నిలుపొద్దని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాజేష్ మీనా, టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

నాగమల్యాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని నాగమల్యాల, గుత్పలా, గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ వ్యాధులపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ రవీందర్ మాట్లాడుతూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు, హెల్త్ అసిస్టెంట్ సంతోష్, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, సాయన్న, ఏఎన్ఎం భారతి, ఆశ వర్కర్ కౌసల్య పాల్గొన్నారు.



పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రగతిశీల మహిళ సంఘం (పీఓడబ్ల్యూ), పీవైఎల్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు, కబడ్డీ, వీల్‌చైర్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మి జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మి, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి కే.రాజన్న, ఎస్.గంగన్నలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కే.లక్ష్మి మాట్లాడుతూ ఆటలు శారీరకంగానే కాకుండా మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈరోజు మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. మహిళలను రెండవ శ్రేణి పౌరులుగా మాత్రమే చూస్తున్నారని, మహిళలకు తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ప్రతిభకు తగిన గుర్తింపు దక్కాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో గంగామణి, గోదావరి, అనసూయ, సునంద, జమున, గంగవ్వ, రాజవ్వ మహిళలు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆడిటోరియం నిర్మించడం అభినందనీయం



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మలంగి గ్రామంలో గుట్టపై సేవాలాల్ ఆడిటోరియంను దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ సొంత ఖర్చుతో నిర్మించడం అభినందనీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం కొత్తపెల్లి దీక్ష భూమిలో పాల్గొని, అనంతరం మలంగి గ్రామాన్ని సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జగదాంబ దేవి జెండా ఆవిష్కరణ చేశారు. సేవాలాల్ జీవిత చరిత్రను తెలియజేస్తూ ఆడిటరియం నిర్మిస్తున్న ప్రవీణ్ నాయక్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి శ్యాం నాయక్, నార్నూర్ మాజీ సర్పంచ్ గజానంద్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ జాదవ్ శ్రీరామ్, మాజీ జెడ్పీటీసీ చారులత, మాజీ జేపీసీ చైర్మెన్ రాథోడ్ ఉత్తం, పంచాయతీరాజ్ ఈఈ జాదవ్ ప్రకాష్, పంచాయతీ రాజ్ డీఈ ధర్మేందర్, నాయకులు తుల శ్రీనివాస్, తిరుమలగౌడ్, తిరుపతి, మాజీ సర్పంచులు తానాజీ, ఉత్తం, రవి నాయక్, రాథోడ్ సుభాష్ ఉన్నారు.

టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో-2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను ఇన్‌చార్జి డీఈఓ వేణుగోపాల్‌రెడ్డి శనివారం డీఈఓ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సొగల సుదర్శన్ మాట్లాడారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన గెజిటెడ్ హెడ్మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టలను ప్రమోషన్ కల్పించాలన్నారు. హెల్త్ కార్డ్ అన్ని హాస్పిటల్స్‌లో నగదు రహిత ట్రీట్మెంట్ అమలు జరగాలని, పెండింగ్ డీఏలు చెల్లించాలని, 50శాతంతో పీఆర్సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మండల ఎంఈఓ సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం సురేందర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కంది శ్రీనివాస్‌రెడ్డి, బొరేకర్ వీరేందర్, సత్యవాన్ చిక్టే, భగత్ అరుణ్ కుమార్, పెందూర్ ప్రకాష్, అబ్దుల్ జాహిద్, తెలంగ్ గణేష్, చంద్రమని మస్కే, పూసం బాలకిషన్, దేవిదాస్ కిలారే, వినోద్ కుమార్, అశ్వాక్ అహ్మద్, రవి జబాడే, లక్ష్మణ్ బామినె, నారాయణ, సుజాత్ ఖాన్, రాజేశ్వర్, పొచ్చన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సమాచారం లేకుండా లైబ్రరీ మూసేశారు'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లైబ్రరీ అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గ్రంథాలయాన్ని మూసి వేశారని, నిరుద్యోగ అభ్యర్థులు ఆరోపించారు. శనివారం లైబ్రరికి వచ్చిన పోటీ పరీక్షల అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. అధికారుల తీరుకు నిరసనగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు మాట్లాడుతూ గతంలో లైబ్రరీని సందర్శించిన కలెక్టర్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారన్నారు. కానీ ఇక్కడి అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా లైబ్రరీని మూసి వేయడంతో గ్రామాల నుంచి వచ్చిన అభ్యర్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఇక ముందు ఇలాంటి పొరపట్లు జరగకుండా చూడాలని కోరారు.

ఆదివాసుల అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలి

- కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం : ఎమ్మెల్యే బొజ్జు



నవతెలంగాణ-ఉట్నూర్

గత పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదివాసుల అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విహార యాత్రకు వచ్చినట్టు ఇలా వచ్చి ఆలా వెళ్లడం ఏంటని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదివాసులను పూర్తిగా విస్మరించిందన్నారు. ఆదివాసీ వీరుడు కుమురంభీం కుటుంబానికి ఎం చేశారో చెప్పాలన్నారు. ఐటీడీఏలను పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని అన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారన్నారు. బీఆర్ఎస్ హయాంలో అనేకమంది విద్యార్థులు చనిపోతే పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో విద్యార్థికి మెరుగైన వైద్యం అందించినప్పటికీ దురదృష్టవశాత్తు చనిపోవడం బాధాకరమని తెలిపారు. స్వార్థ రాజకీయాల కోసం దీన్ని బీఆర్ఎస్ తప్పు దోవ పట్టించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివాసీ సంఘాలతో సమావేశమై వారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులకు 100శాతం ఓవర్సీస్ స్కాలర్ షిప్, ప్రత్యేక ఇందిరమ్మ ఇండ్లు, వ్యవసాయ రైతులకు బోర్స్, పంప్ సెట్లు, గోండి బాషాలో బోధన, ఆదివాసీ వీరుడు కుమురంభీం జయంతి, వర్ధంతి వేడులకలను అధికారికంగా నిర్వహించడానికి నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆదివాసీ ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేస్తామని ప్రభుత్వం తెలిపిందని, ఆదివాసుల పక్షాన ప్రజా ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడం హర్షణీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాలు, ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడం హర్షణీయమని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, గోండ్వాన పంచాయతీ రాజ్ సెంటర్, ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారన్నారు. విద్య, ఉద్యోగావకాశాలు, రోడ్లు, రవాణా, సాగు, తాగునీటి వంటి పలు అంశాలు, జీఓ నెంబర్ 3 పునర్దరణ ఏజెన్సీ ప్రాంతాల్లో జీఓ నెంబర్ 317 రద్దు, ఆదివాసీ నిరుద్యోగ యువత కోసం స్పెషల్ డీఎస్సీ, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న



ఆదివాసులకు ఇంటి పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం సమర్పించారన్నారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలివ్వడం చాలా సంతోషకరమన్నారు. అదేవిధంగా కొమురంభీమ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో తుడుందెబ్బ నాయకులు ఉన్నారు.

రాజకీయాల్లో హుందాతనం ఉండాలి

- ఎమ్మెల్యే పాయల శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మూపై సంవత్సరాల తన రాజకీయ జీవితంలో ఎన్నడూ కూడా చిల్లర రాజకీయాలు, వ్యక్తిగతంగా దుషనాలు చేయలేదని, రాజకీయాల్లో హుందాతనం ఉండాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా ఎదుగుతుంటే చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తను రాజకీయాల్లో ఉన్నంత మాత్రన తన చుట్టూ పక్కాల వారికి ఆస్తులు వస్తే తన ప్రమేయం ఉందని చెప్పాడం హస్యస్పాదంగా ఉందన్నారు. ఇరిగేషన్‌కు సంబంధించిన భూమిని కబ్జా చేసి షెడ్డును నిర్మించారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా పలుమార్లు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కను కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం మాట్లాడటం జరిగిందన్నారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించడంతో వారికి ధన్యవాదాలు చెప్పాడం మంచి పనులు చేస్తున్నందుకు పొగడటం తన తప్ప అని ప్రశ్నించారు. దీన్ని సాకులగా చూపి తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు దుష్ప్రచారం చేసే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేలుగా పదవులు సాగించిన రామచంద్రారెడ్డి, వామన్‌రెడ్డిలు భౌతికంగా లేకపోయిన ఇప్పటికి వారంటే గౌరవం ఉందన్నారు. వారు ఎన్నడు కూడా చిల్లర రాజకీయాలు, వ్యక్తిగత దుషణాలు చేయలేదన్నారు. మరోసారి తనపై ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. తను అవినీతికి పాల్పడితే కాంగ్రెస్ అధికారంలో ఉందని, విచారణ జరిపించాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం, నాయకులు ఆదినాథ్, నగేష్, రత్నాకర్‌రెడ్డి, రమేష్, వేణుగోపాల్, లాలా మున్నా, ఆకుల ప్రవీణ్, సోమ రవి, జోగు రవి, రాజేష్, రఘుపతి, శ్రీనివాస్, సుభాష్, దయాకర్, రాష్ట్రపాల్, బోయర్ విజయ్, భీం సేన రెడ్డి, రవి రెడ్డి, వేదవ్యాస్, మహేందర్, నాయకులు ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయాణీకులకు మరింత చెరువయ్యేలా ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగిందని ఆర్టీసీ డీఎం కల్పన అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రయాణీకులతో పాటు మహిళ ఉద్యోగులు, వారి పిల్లలు ఉత్సహంగా పాల్గొన్నారు. రంగురంగు ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. అనంతరం మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎం కల్పన మాట్లాడుతూ ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేయడంతో పాటు వారికి మరింత దగ్గర అయ్యేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగానే ఆర్టీసీ





ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు, ఉద్యోగులు, వారి పిల్లలు ఉత్సహంగా పాల్గొన్నారని తెలిపారు.

మాస్టర్ మైండ్ పాఠశాలలో ముగ్గుల పోటీలు..

మాస్టర్ మైండ్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా పాఠశాలల డైరెక్టర్‌లు సాయిని రవికుమార్, విజయ్, ప్రముఖ గైనాకాలజిస్టు విజయ హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలను ఆశీర్వాదించి వారి తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. అనంతరం కైట్ ఫెస్టివల్, మహేంది పోటీలను నిర్వహించారు. పండుగల విశిష్టతను తెలియజేడానికే ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించామని మాస్టర్ మైండ్ పాఠశాల డైరెక్టర్ సాయిని రవి కుమార్ తెలిపారు. చదువుతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయడమే లక్ష్యంగా అన్ని పండుగలను పాఠశాలలో ముందస్తుగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసీం, ఉపాధ్యాయులు శ్వేత, స్వామి, శ్రావంతి ఉన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-జైనథ్

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. అన్నదాతలకు ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర తాత్సారం చేస్తోందని, రైతుబంధు, రైతుబీమా పథకాలకు సంబంధించి రైతులను మోసం చేసిందని అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. భోరజ్ జాతీయ రహదారిపై బైటాయించిన నాయకులు ప్రభుత్వ విధానాలకు నిరసనగా నినాదాలతో హోరెత్తించారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. రైతులకు బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. నిరసనలో భాగంగా ముఖ్యమంత్రి ఫోటోను దహనం చేసేందుకు నాయకులు యత్నించగా, వారిని పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆందోళనకారులను పోలీసులు సముదాయించే ప్రయత్నం చేశారు. ధర్నాలో నాయకులు విజ్జగిరి నారాయణ, యాసం నర్సింగరావు, మార్శెట్టి గోవర్ధన్, లింగారెడ్డి, గణేష్ యాదవ్, విజయ్, పుండ్రు వెంకట్ రెడ్డి, సతీష్, రామ్‌రెడ్డి, ఉశన్న, భోజన్న, పురుషోత్తం, దేవన్న, గంగన్న, కస్తాల ప్రేమల, స్వరూప రాణి, పర్వీన్, కరుణ, వాగ్మారె ప్రశాంత్‌లతో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చైనా మాంజా వినియోగం నేరం : డీఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా వినియోగం చట్టరీత్య నేరమని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో పలు షాపుల్లో చైనా మాంజాను విక్రయిస్తున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్ ఇన్స్‌పెక్టర్ సిబ్బంది సహకారంతో పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అశోక్ రోడ్‌లోని లక్ష్మి సీజనల్ షాప్‌లో ఓనర్ శ్రీనివాస్ వద్ద రూ.50వేలు విలువచేసే నిషేధిత చైనా మాంజా లభ్యమైనట్టు తనపై ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేస్తున్నట్టు పేర్కొన్నారు. దుకాణాల యజమానులకు వర్తక వ్యాపారులకు నిషేధిత చైనా మాంజాను విక్రయించినట్లయితే వారిపై నూతన చట్టం ప్రకారం కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. ప్రజా జీవన విధానానికి, పశు వులకు ఆపదను కలిగించే చైనా మాంజా వినియోగం ప్రమాదకరమని తెలియజేశారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఒకటవ పట్టణ సీఐ సునీల్, రెండవ పట్టణ సీఐ కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-నార్నూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తపెల్లి(హెచ్)లో శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ దీక్ష భూమి జాతర మహోత్సవ గురు కృప దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా సంత్ శ్రీ ప్రేమ్ సింగ్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి ఏడాది ఎంతో భక్తిశ్రద్ధలతో బంజార సోదరులు ఈ జాతరను నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అభివృద్ధి విషయంలో ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడు ముందు వరుసలో ఉండి సబ్బండ వర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, బంజారా సంఘం నాయకులు పాల్గొన్నారు.

దేవరకోట దేవస్థాన ఆలయంలో కుడార్రై ఉత్సవం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ధనుర్మాసం సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవరకోట దేవస్థాన ఆలయంలో శనివారం కుడార్రై ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తులసీ దళాలతో అర్చన కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్వామివారికి 108 గంగాళల్లో నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ శ్రీనివాస్, పూజరులు రామ కన్నన్, నవీన్, ధర్మకర్తలు సంతోష్, నరేందర్, చిరంజీవి, రాజన్న భక్తులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | జనవరి 12, 2025 | www.navatelangana.com

14న ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-వాంకిడి

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి పక్కన గల మైదానంలో కాంగ్రెస్ పార్టీ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 14న ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని యువజన అధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. గెలుపొందిన మహిళలకు బహుమతులను అందిస్తామన్నారు. మొదటి బహుమతి రూ.6000, ద్వితీయ బహుమతి రూ.3000, తృతీయ బహుమతి రూ.1500లతో పాటు ప్రోత్సాహక బహుమతులు కూడా అందించడం జరుగుతుందన్నారు. వివరాల కోసం సెల్ : 9705749712ను సంప్రదించాలన్నారు.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

ఆసిఫాబాద్ : కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించడం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు మసాడే చరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



గుడుంబా స్థావరాలపై ఈస్గాం పోలీసులు దాడులు నిర్వహించి 150 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నజురుల్ నగర్ విలేజ్ నెంబర్ 5 గ్రామ శివారులో గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు శనివారం గుడుంబా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడులలో తుంగమడుగు గ్రామానికి చెందిన మహేష్ తయారు చేస్తూ పట్టుబడ్డాడు. ఈ దాడిలో 150 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 5 లీటర్ల గుడుంబాను స్వాధీన పరుచుకుని కేసులు నమోదు చేశారు. ఎవరైనా గుడుంబా తయారు చేసిన విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.

పండగ వేళ.. కాగుతున్న వంట నూనెలు

- లీటర్‌కు రూ.15 నుంచి రూ.20 వరకు పెరుగుదల
- సామాన్య మధ్యతరగతి ప్రజలపై భారం



నవతెలంగాణ-కెరమెరి

నిత్యావసర సరుకుల్లో ఎంతో అవసరమైన వంట నూనె ధరలు రోజురోజుకు కాగుతున్నాయి. దిగుమతి సుంకాలు పెరగడంతో పామాయిల్, పొద్దుతిరుగుడు, నువ్వు నిలువు ధరలో భారీగా పెరుగుతున్నాయి. సామాన్య ప్రజల మధ్య తరగతి ప్రజలపైనే కాదు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై కూడా వీటి ప్రభావం పడుతుంది. వంటింటి బడ్జెట్‌పై భారం పడుతుందని మహిళలు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల వ్యవధిలో లీటర్‌పై కనిష్టంగా రూ.20 ధర పెరిగింది. ఈ లెక్కన నెలకు లక్షల్లో అదనపు భారాన్ని జిల్లా ప్రజల మోయాల్సి వస్తుంది. క్రిస్టమస్, సంక్రాంతి వంటి ముఖ్య పండుగలు వరుసగా వచ్చిన నేపథ్యంలో నూనెల వినియోగం భారీగా పెరుగుతుంది. ఆ మేరకు భారం పడుతుందని సామాన్యలు వాపోతున్నారు. గత నెలలోనే పొద్దు తిరుగుడు, పామాయిల్ లీడర్‌కు సగటున రూ.20 ధర పెరిగింది. మరోవైపు వేరుశనగ నూనె ధర పరవాలేదనిపిస్తుంది. రూ.5 వ్యత్యాసాల నడుమ కిలో రూ.170 నుంచి రూ.175 మధ్య కొనసాగుతుంది. దీని ధర స్థిరంగా ఉండడం కొంత ఊరట నిస్తుంది.

రాయితీపై ఇస్తేనే...

ప్రస్తుతం పండగల సీజన్ కావడంతో వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. దుకాణదారులు సైతం వాటికి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



దీంతో గత నెలలో రూ.10 నుంచి 20 రూపాయలు పెంచే అవకాశం ఉన్నట్లు వ్యాపార వర్గాల చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు బయట మార్కెట్‌లో కంటే కొంచెం తక్కువ ధరకు నూనె అందించేలా ప్రత్యేక కేంద్రాలు, రేషన్ దుకాణాల్లో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సామాన్యులపై భారం..

రోజువారి కూలీ పనులు చేసుకునే జీవనం సాగించే వారికి నూనె ధరలు భారంగా మారాయి. ఇప్పటికే నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో అదనంగా ఇప్పుడు వంటనూనెల ధరలు 20 నుంచి 30శాతం అధికమవడంతో సామాన్యులపై మరింత భారం పడింది. లీటరుపై రూ.25 నుంచి రూ.30 వరకు ధరలు పెరిగాయి. ఐదు లీటర్ల డబ్బాపైన రూ.350 వరకు ధరలు పెరిగాయి.

కృత్రిమ కొరత?

కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 20శాతం పెంచుతున్నట్టు ప్రకటించగానే పంపిణీదారులు, డిస్ట్రిబ్యూటర్లు వేగంగా నూనె ధరలను పెంచేశారు. సుంకం పెంచడంతోనే ధరలను పెంచుతున్నట్టు చెబుతున్న టోకు వ్యాపారులపై పర్యవేక్షణ చేసే అధికారులు జిల్లాలో కరువయ్యారు. గతంలో పౌరసరఫరాల అధికారులు అత్యావసర సరుకుల చట్టం కింద అడ్డగోలుగా ధరలు పెంచకుండా నియంత్రించేవారు. ప్రస్తుతం వారిపై ఆజామయిషి కరువైందంటున్నారు. కొంతమంది పంపిణీ దారిలో వారి వద్ద ఉన్న నిలువలను దాచి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు వేలువేత్తుతున్నాయి.

పిండి వంటలు చేసుకోలేని దుస్థితి

రాథోడ్ లత, గృహిణి కెరమెరి



జూన్ మాసంలో లీటర్ నూనె లీటర్ రూ.115 నుంచి 120 ఉండే. ఈ నాలుగు నెలల వ్యవధిలో అదనంగా రూ.25 నుంచి 30 పెరిగింది. గతంలో ఈ సమయానికి నూనెల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం పండగ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. రోజు వారీ కూలీలు కొనలేని దుస్థితి. ప్రభుత్వం వంట నూనెల ధరలు తగ్గించాలి.

ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

సెడ్మకి ద్రుపతాబాయి, మాజీ జడ్పీటీసీ



సంక్రాంత్రి పండగ నేపథ్యంలో నూనెల ధరలు అమాంతంగా పెరిగాయి. దీంతో సామాన్య ప్రజలపై భారం పడుతోంది. పేద ప్రజలు కోనలేని పరిస్థితి నెలకొంది. పండగ సందర్భంగా అడ్డగోలుగా ధరలు పెంచేచేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెరుగుతున్న నూనెల ధరలను అరికట్టాలి. వ్యాపారస్తులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పేద ప్రజలకు సంక్రాంతి పండుగ సందర్భంగా రేషన్ దుకాణాల్లో రాయితీపై అందించాలి.

మహేందర్‌రెడ్డిని గెలిపించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతగా మహేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని జిల్లా ఎన్నికల సమన్వయకర్త తంగడిపల్లి రాకేష్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాసరావు, సునార్కర్ అనిల్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు ఉప్పుల నరసింహచారి అన్నారు. శనివారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఉపాధ్యాయ శాసన మండలి అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ అభ్యర్థులకే ఓటేయాలని, 50శాతం ఫిట్ మెంట్‌తో మంచి పీఆర్సీ సాధిస్తామని, సీసీఎస్ రద్దు చేసే విధంగా కార్యాచరణ చేపడతామని, ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న వివిధ బిల్లులను వెంటనే విడుదల చేసే విధంగా కార్యాచరణ తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సోదర సంఘాల సభ్యులు కూడా వంగ మహేందర్ రెడ్డికి ప్రాధాన్యత ఓటేయాలని వారిని కోరారు. కార్యక్రమంలో ముంజంపల్లి రమేష్, గుండు యాదగిరి, మడవి హనుమంతు, దెబ్బటి సత్యనారాయణ, రామచందర్, వికాస్, దామోదర్, సాంబశివరావు తిరుపతి పాల్గొన్నారు.

నిషేధిత చైనా మాంజాను అమ్మితే చర్యలు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

నిషేదిత చైనా మాంజాను అమ్మిన, వినియోగించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కొమురయ్య హెచ్చరించారు. శనివారం మండలంలో అయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. చైనా మంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. చైనా మాంజాతో నైలాన్, సింథటిక్ దారాలు పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయన్నారు. చైనా మాంజాను అమ్మినా, రవాణ చేసినా సమాచారం అందించాలని కోరారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో దుప్పట్లల పంపిణీ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని అడవి సమీప గ్రామాలు మేరగూడ, మురళిగూడా, కమ్మర్‌గాం గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో వృద్దులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అడవిలో జరిగే అగ్ని ప్రమాద కారణాలు, నివారణ చర్యలు, అగ్ని వల్ల కలిగే నష్టాలు, అడవి జంతువుల సమాచారం గురించి తీలుసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి జమీల్ హైమద్, బీట్ అధికారి సతీష్, సెక్షన్ అధికారి జగన్మోహన్, బీట్ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదివాసులకు ఒరిగిందేమీ లేదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదివాసులకు ఒరిగిందేమీలేదని, మాయమాటలతో మభ్యపెట్టి మోసగించారని, ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మాజీ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. శనివారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి ఆదివాసీ సమాజం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నో ఏండ్లుగా ఆదివాసులు తమ హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం సుధీర్ఘమైన పోరాటం, ఉద్యమం చేస్తున్నారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏనాడు ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి పట్టించుకున్న పాపానపోలేదన్నారు. మొదటిసారిగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ఆదివాసీ పెద్దలతో సమావేశమై అభిప్రాయాలు సేకరించడం, అనేక సమస్యలపై చర్చించడం నిజంగా అభినందనీయమని అన్నారు. ఆదివాసులను అన్నిరంగాల్లో అభివృద్ధిపర్చాలనే ఆలోచనతో కంకణం కట్టుకుని ఆ దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, బొల్లారం బాబన్న, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ, నాయకులు పెందూర్ మోహన్, తానాజీ, సోయం అవినాష్, సోము, అల్చెట్టి నాగన్న, దాసరి ఆశన్న, రతన్, దీపక్‌రావు, మహమూద్, సోమ ప్రశాంత్ పాల్గొన్నారు.

హైమన్ డార్ఫ్ దంపతుల సేవలు సదాస్మరణీయం

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్
- డార్ఫ్ దంపతులకు కలెక్టర్, ఎమ్మెల్యేల నివాళి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆదివాసుల జీవన ప్రమాణాలను అభివృద్ధి చేసేందుకు ఎనలేని కృషి చేసిన హైమన్ డార్ఫ్ ఎలిజిబెత్ దంపతుల సేవలు సదాస్మరణీయమని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. శనివారం జైనూరు మండలం మార్లవాయి గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ, మార్లవాయి గిరిజన యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన హైమన్ డార్ఫ్ ఎలిజిబెత్ దంపతుల 38వ వర్ధంతి వేడుకలలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, అదనపు ఎఎస్పీ చిత్తరంజన్‌లతో కలిసి హైమన్ డార్ఫ్ దంపతుల సమాధుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆదివాసుల జీవన ప్రమాణాలను పెంచి వారిని సమాజంలో ఉన్నత స్థాయిలో నిలిపేందుకు హైమన్ డార్ఫ్ ఎలిజిబెత్ దంపతులు చేసిన కృషి మరువలేనిదన్నారు. గతంలో 30 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా తాను పని చేసిన సమయంలో పేసా చట్టం తీసుకురావడంలో సమిష్టిగా పనిచేసి జాతి అభివృద్ధికి సమిష్టిగా కృషి చేశామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ 60 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలోని గిరిజనుల హక్కులు, జీవన ప్రమాణాలపై మానవ పర్యావరణ శాస్త్రవేత్తలు హైమన్ డార్ఫ్ బెట్టిఎలిజిబెత్ దంపతులు ఆదివాసులతో మమేకమై వారి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అలుపెరగకుండా కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వం ఆదివాసుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్య, వైద్య ప్రమాణాలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు ఐటీడీఏ ఆధ్వర్యంలో మారుమూల గ్రామాలను అనుసంధానం చేస్తూ రహదారుల కల్పన, అటవీ భూముల సమస్యలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరించే దిశగా కృషి చేస్తుందన్నారు. మార్లవాయి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మాట్లాడుతూ ఆసిఫాబాద్ ఆదివాసీ ప్రాంతాలలో ఎలాంటి సౌకర్యాలు లేని రోజులలో గిరిజన గూడాలలో నివసిస్తూ ఆదివాసులు ఎదుర్కొంటున్న భూములు, విద్య, వైద్య ఇతర రంగాల సమస్యలపై సమగ్ర విచారణ జరిపి ఆదివాసుల సంక్షేమం పక్షంగా ఆనాటి ప్రభుత్వాలకు నివేదికలు పంపించడం ద్వారా గిరిజనుల సంక్షేమానికి హైమన్ డార్ఫ్ దంపతులు నాంది పలికారన్నారు. ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని, గిరిజన ప్రాంతాలలోని పెర్సాపెన్ దేవాలయాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాలలో రాయి సెంటర్ల భవనాల మంజూరు, ఐటీడీఏ బలోపేతం, నియోజకవర్గాలకు 3,500 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజనులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతిని పురస్కరించుకొని మూడు రోజులుగా నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, ఐటీడీఏ ఏపీఓ మెస్రం మనోహర్, ఈఈ తానాజీ, మార్లవాయి మాజీ సర్పంచ్ కనక ప్రతిభ, గిరిజన సంఘాల నాయకులు కొడప రాము, విశ్వనాథ్, మెస్రం దుర్గా పటేల్, రాయి సెంటర్ జిల్లా సర్ మెడి సుదర్శన్, మానవ హక్కుల సంఘం కార్యదర్శి భుజంగరావు, గిరిజన సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మహనీయుల చరిత్ర భావితరాలకు అందించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహనీయుల చరిత్రను భావితరాలకు అందించే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒడ్డే ఓబన్న జయంతి వేడుకలలో పాల్గొని వడ్డెర కుల సంఘ నాయకులు, ప్రముఖులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒడ్డే ఓబన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమలో రేనాడు ప్రాంతంలో 1816 సంవత్సరం జనవరి 11న జన్మించి, 18వ శతాబ్దంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఆనాడు సంచార జాతులైన వడ్డెరలు, బోయలు, చెంచులు వంటి జాతులకు నాయకత్వం వహిస్తూ నల్లమల ప్రాంతంలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ దౌర్జన్యాలను ఎదుర్కొని తన జాతులను కాపాడుకున్న మహనీయుడని కొనియాడారు. ఓబన్న దేశంలోని బహుజనులందరికీ గర్వకారణమని, ప్రభుత్వం ఓబన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, వడ్డెర కుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, పీఏసీఎస్ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, ఆసిఫాబాద్ మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, వడ్డెర కుల సంఘాల ప్రతినిధులు కనకయ్య, ముద్దంగుల హనుమంతు, కోరాల రాజు, రాపాక రమేష్ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



నవతెలంగా-ఆసిఫాబాద్

ఉమ్మడి జిల్లా జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ కోచింగ్ క్యాంప్‌ను క్రీడా పాఠశాల హెచ్ఎం జంగు ప్రారంభించారు. 9న ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో జరిగిన ఉమ్మడి జిల్లా జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక పోటీలలో ఎంపికైన క్రీడాకారులకు స్థానిక క్రీడ పాఠశాల మైదానంలో శనివారం నుంచి 7 రోజుల పాటు వరకు కోచ్ సునార్కర్ అరవింద్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. హ్యాండ్ బాల్ కోచింగ్ క్యాంప్‌ను ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని బాల్ గోల్ విసిరి ప్రారంభించారు. ఉత్తమ శిక్షణతో పాటు నిత్యం సాధన చేస్తు పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోనె శ్యామ్ సుందర్ రావు, కనపర్తి రమేష్, కోచ్ అరవింద్, రాకేష్‌చ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషి వల్లనే దిందా వంతెన అనుమతులు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కృషి వల్లనే దిందా వంతెనకు అనుమతులు లభించాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం అన్నారు. శనివారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కొందరు నాయకులు దిందా వాగు వద్దకు వెళ్లి మా కృషితోనే అనుమతులు వచ్చాయని చెప్పుకుంటున్నారని, కానీ అనుమతుల కోసం నిత్యం ఎమ్మెల్యే జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు అటవీ మంత్రి వద్దకు వెళ్లి అటవీ శాఖకు రూ. 69 లక్షలు చెల్లించేలా కృషి చేశారని, దీని వల్ల అనుమతులు వచ్చాన్నారు. బీఆర్ఎస్ దండుపాల్యం బ్యాచ్ అంతా కాంగ్రెస్‌లో చేరి ఇప్పుడు ఎలక్షన్ ముందర 420లో భాగంలోనే ఆడే నాటకమని ఆరోపించారు. గ్రామస్తులు ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే దిందా గ్రామానికి రాకపోకలు నిలిచిపోయేవని, కనరాని కష్టాలు ఉండేవని, అటువంటి సమయంలో వారికి కష్టసుఖాలాలను తెలుసుకొని ఆ గ్రామం నుండి కలెక్టరేట్ వరకు పాదయాత్ర అన్ని విధాల పార్టీ తరపున వారి వెంటే ఉన్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎలుమ్ముల్లే మల్లయ్య, మాజీ సర్పంచ్లు చౌదరి నానయ్య, సుశీల్ కుమార్ మండల్, డోకే రామన్న, చౌదరి నవీన్, డగె అంకులు, చౌదరి రంగన్న, కతేర్ల భీమయ్య, పవన్, కుకడ్కర్ రమేష్, పురుషోత్తం చారి, డోంగ్రే నానాజీ, సత్పుతే తుకారాం, నాగపూరే మోహన్, దుబ్బుల మురళి, చాప్లే సుధాకర్ పాల్గొన్నారు.

జాతర కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-జన్నారం



మండలం లోని పొనకల్ శివారులో గల వీర్లగుట్టపై వెలసిన శ్రీ కేతేశ్వర కంకాలమ్మ జాతరకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఉట్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ నెల 19న కేతేశ్వర జాతరకు తప్పకుండా హాజరు కావాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ఆలయ కమిటీ నిర్వాహకులు ఆహ్వానం పలికారు. జాతరకు తప్పకుండా వస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హామీ ఇచ్చారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఎమ్మెల్యే కోరారు. కరపత్రాలు విడుదల కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు చిలువేరి నర్సయ్య, పర్ల కనకయ్య, సంధ కృష్ణ, పిల్లి రవి, చిలువేరి సుధీర్ కుమార్ ఉన్నారు.

మాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



మాల కుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం రోజున మాల కులస్తుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాముఖ కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా కండ్లే శ్రావణ్ కుమార్, కోశాధికారిగా కోడే ఇసాక్, ఉపాధ్యక్షులుగా బోట్ల సంజీవ్, గద్దల పవన్, సౌడం ప్రభాకర్, నెమలికొండ గోపి, కార్యదర్శులుగా భోజనపు సురేందర్ గుడెపు భూమన్న, స్వామి, కుంభాల రాజన్న, కార్యవర్గ సభ్యులుగా దాసర్ల రాజన్న, తోకల ఎల్లయ్య, మంత్రి రాజు, కండ్లే సతీష్, సలహాదారులుగా అక్కవతల దేవయ్య, సిటిమల్ల భరత్ కుమార్, పాత బాలరాజు, మేకల మాణిక్యం, జక్కుల సురేష్, అల్గనూరి పద్మారావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అవును చంపిన పులి

- పరిహారం అందజేసిన ఫారెస్ట్ అధికారులు



నవతెలంగాణ-హాజీపూర్

పులి దాడిలో అవు మృతిచెందిన ఘటన మండలంలోని నాగరం అడవి సెక్షన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగారం గ్రామ పరిధిలోని దుబ్బగూడెంకు చెందిన గోపతి లస్మయ్యకు చెందిన అవు శుక్రవారం సమీప అడవిలోకి మేతకు వెళ్ళింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో పశు యజమాని స్థానికులతో కలిసి అడవిలో గాలించగా పులి దాడిలో ఆవు మృతి చెంది సగం వరకు తిని వుంది. గమనించిన లస్మయ్య ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. శనివారం లక్షెట్టిపేట్ రేంజ్ అధికారి అత్తె సుభాష్ సిబ్బందితో కలిసి ఆవు మృతి చెందిన సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి పులి దాడి చేసి నట్లు ధ్రువీకరించారు. అటవీ చట్టం ప్రకారం క్రూర మగాల దాడిలో ఏదైనా పెంపుడు జంతువు చనిపోతే 24 గంటల లోపు యజమానికి పరిహారం అందించాలని నిబంధన ప్రకారం ఆవు యజమాని లస్మయకు తక్షణ పరిహారం రూ.12 వేల చెక్కును అందజేశారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



న0వతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హైదరాబాద్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వరరావు, సెంట్రల్ ట్రెజరర్ జిమిడి మల్లేష్, శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేగల ప్రవీణ్ కుమార్, బ్రాంచ్ సెక్రెటరీ నక్క సుమన్ పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి సెలవు రోజు పాఠశాలలు నిర్వాహిస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల జిల్లాలోని ప్రయివేట్ పాఠశాలలో సెలవులు ప్రకటించకుండా పాఠశాలను నడిపిస్తున్నందున మండల విద్యాధికారి మాళవికకు ఫిర్యాదు చేయడంతో పాఠశాలను మూసివేశారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ జిల్లాలో కొన్ని యజమాన్యాలు సెలవు రోజులలో కూడా విద్యార్థులను ఆదనపు తరగతులు, పరీక్షల పేరు మీద ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, మరలా ఇలాంటి సంఘటనలు జరిగితే యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా గోదా దేవి కళ్యాణం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ గ్రామంలో ఉన్న శ్రీ సీతారామ దేవాలయంలో గోదాదేవి రంగనాథుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతం వేదపండితులు గోదాదేవి రంగనాదులకు కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. రేండ్లగూడ గ్రామానికి చెందిన ఉత్తమ సేవ అవార్డు గ్రహీత కస్తులపురి సాగర్ వర లక్ష్మి దంపతులు భక్తులకు భగవత్ గీత పుస్తకాలను అందజేశారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు సంక్రాంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు వేసిన రంగవళ్లులు పలువురిని ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం అశ్విని విద్యార్థులను అభినందించారు. బాలురచే పతంగులు ఎగురు నేశారు. అనంతరం విద్యార్థులు సంతోషంగా పాటలు, నృత్యాలతో అలరించారు. సాయంత్రం వేళల్లో భోగి మంటలు వేసి ఉపాధ్యాయులందరూ సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్. వి శ్రీనివాస్, పీసీటి ఇన్‌చార్జి శిరీష, ప్రైమరీ ఇన్‌చార్జి శైలజ, పీఈటీ కిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇంత ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పాఠశాలల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీ విద్య అభినందించారు.



అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అరణ్య రోదన

- పండుగలకు పస్తులుంటున్న వైనం
- ఆర్థిక ఇబ్బందుల్లో ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది
- ఆందోళనకు సిద్ధమవుతున్న కార్మికులు



నవతెలంగాణ-మంచిర్యాల

బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పండగ పూట ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గత ఆరు నెలలుగా వేతనాలు రాక అప్పుల బాదతో సతమతమవుతున్నారు. కుటుంబ పోషణ భారమై వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. ఏజెన్సీ చేతిలో చిక్కి అల్లాడుతున్నారు. బెల్లంపల్లి 100 పడకల ఆస్పత్రిలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీ నార్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలకు ఎప్పటికి అప్పుడు ఉద్యోగుల వేతనాల బిల్లులు చెల్లిస్తున్న ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ, ట్యాక్స్ చెల్లింపుల్లో చేతి వాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సదరు ఏజెన్సీ కాంట్రాక్టర్లు, మరి కొందరు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు అయితే నెలల తరబడి జీతాలు ఇవ్వక ఉద్యోగులను ఇబ్బందులకు గురు చేస్తున్నారు.

పండుగలకు పస్తులే..

బెల్లంపల్లిలో గల 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా పలు విభాగాల్లో స్లీపర్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ ఇతర విభాగాలలో పని చేసేందుకు 36 మంది ఉద్యోగులను నియమించారు. సదరు ఏజెన్సీ నిర్వాహకులు గత 6 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో బాధితులు ఆందోళన భాట పట్టారు. దసరా, దీపావళి, క్రిస్టమస్ పండుగలు గడిచిపోయాయని సంక్రాంతి పండుగకు కూడా జీతాలు అంధక పోవడంతో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఎదురవుతోందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ నిర్వాహకుల కారణంగానే ఉద్యోగులకు జీతాలు అందడం లేదంటూ ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు ఏజెన్సీ నిర్వాహకులను నిలదీసినపుడు త్వరలోనే వేతనాలు చెల్లిస్తామని చెప్పడమే తప్ప అమలు పర్చడం లేదని ఆధన వ్యక్తం చేస్తున్నారు. వేతనం అడిగిన వారిని ఉద్యోగంలోంచి తీసివేస్తామని బెదిరింపులకు పాల్పడుతూ.. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు వేతనాలు ఇప్పించాలని వేడుకుంటున్నారు.

అధికారులు స్పందించాలి

సంకె రవి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి



వెట్టి చాకిరి చేయించుకొని సిబ్బందికి సమయానికి జీతాలు ఇవ్వని అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ పై అధికారులు చర్యలు తీసుకోవాలి. అధికారులు స్పందించి ఉద్యోగులకు రావాల్సిన 6 నెలల జీతాలను ఇప్పించాలి. ఈపీఎఫ్, ఈఎస్ఐ ట్యాక్స్ చెల్లింపుల్లో కోతలు విధించ కుండా చూడాలి. తక్షణమే అధికారులు స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలి లేని పక్షాన కార్మికుల తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కర్యదర్శి ఎండీ అక్బర్ అలీ డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం వైఫల్యం చెందిందని అన్నారు. ఒకే కుటుంబం, ఒకే లక్ష్యం, ఒకే గమ్యమని చెప్పుకునే సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులపై సవతి తల్లి ప్రేమను చూపిస్తుందన్నారు. సెప్టెంబర్ 2022న సమ్మె సందర్భంగా యాజమాన్యంతో కుదిరిన ఒప్పందాలను 2 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. కోల్ ఇండియాలో అమలవుతున్న హై పవర్ కమిటీ వేతనాలను సింగరేణిలో అమలు చేయాలని అవి అమలయ్యే వరకు జీఓ నెంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెల 7వ తేదీన వేతనాలు చెల్లించాలని సర్క్యులర్ జారీ చేసినప్పటికీ దానిని అమలు చేయలేకపోతుందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు వెంటనే ఈఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. మైన్స్ ఆక్ట్ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు కనీస సౌకర్యాలైన లీవులు, సిక్కులీవ్, పండుగ సెలవులు మంజూరు చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులందరికీ సీఎంపీఎఫ్ పుస్తకాలను అందించాలని, సీఎంపీఎఫ్ లోన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల పనిని బట్టి సెమీస్కిల్డ్, స్కీల్డ్, హైలీ స్కిల్ వేతనాలు చెల్లించాలన్నారు. ఓబిలలో పనిచేస్తున్న వాల్వో డ్రైవర్లను వాల్వో ఆపరేటర్లుగా గుర్తించి వారికి హైస్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, సెక్యూరిటీ గార్డ్‌లకు వృత్తి పన్ను రద్దుచేసి ఉచితంగా యూనిఫామ్స్ అందజేయాలన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించకపోతే భవిష్యత్తులో ఆందోళనలను మరింత ఉద్రుక్తం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జీఎం సూర్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముష్కే సమ్మయ్య, రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు రాచర్ల చంద్రమోహన్, ప్రభాకర్, సహాయ కార్యదర్శి చారి, కోశాధికారి పల్లె సత్యం, సమ్మయ్య, గణేష్, అనిత, శ్యామల, బాపు, లింగయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, విజయ్, కొమరమ్మ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

- ఎస్ఐ సతీష్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని, అంబేద్కర్ చౌరస్తాలో ఆర్టీసీ బస్సులు నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు కోరారు. శనివారం అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన కూడళ్ళయిన అంబేద్కర్ చౌరస్తా, గాంధీచౌక్, పాత బస్టాండ్ ఏరియాల్లో నిత్యం వాహనాల రద్దీ కొనసాగుతుందని, వారసంతల రోజు ప్రజలు, వాహనాల రద్దీ మరీ ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ ట్రాఫిక్‌ను నియంత్రించాలని కోరారు. భారీ వాహనాలు రోడ్డుపై నిలిపి లోడింగ్, ఆన్ లోడింగ్ చేయడంతో వాహన దారులకు ఇబ్బందిగా మారిందన్నారు. అంబేద్కర్ చౌరస్తాలో ఆర్టీసీ బస్సులు నడిరోడ్డుపై ఆగడం వల్ల వెనక నుండి వచ్చే వారికీ ఇబ్బందిగా ఉందన్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం భారీ ట్రాఫిక్ ఉంటుందని, వెంటనే ఆర్టీసీ బస్సులు దూరంగా ఆపాలని కోరారు. నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఐను కోరారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. నిబంధనల మేరకే వారసంత కొనసాగేలా చర్యలు చేపడుతామని, ఇద్దరు పోలీసులను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దమ్మ నారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిప్పకుర్తి నారాయణ, జిల్లా నాయకులు మాలెం చిన్నన్న, సీనియర్ నాయకులు భూపెల్లి మల్లేష్, జక్కుల రాజలింగు, మినుముల జనార్దన్, మండల గౌరవ సలహాదారు లింగంపల్లి వెంకటేష్, ఉపాధ్యక్షులు భైరం లింగన్న, వేల్పుల ప్రేమ్ సాగర్, మహేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, ఉపాధ్యక్షులు లింగంపల్లి సుధాకర్, కండె మొగిలి, అడ్లూరి శివకుమార్, మంచాల కుమార్, చాతరాజు రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

- జైపూర్ ఎస్ఐ శ్రీధర్

నవతెలంగాణ-జైపూర్



గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సహించడం సాంప్రదాయంగా కొనసాగించాలని స్థానిక ఎస్ఐ శ్రీధర్ అన్నారు. ఎమ్మెల్యేగా వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీగా వంశీకృష్ణ ఏడాది పాలన పూర్తి చేసుకున్న సంధర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో యువతరం ఆటపాటల పట్ల ఆసక్తి ఉండేదని ప్రస్తుతం సెల్‌ఫోన్లకు అంకితమై ఆటపాటల పట్ల అంతగా ఆసక్తి చూపడం లేదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆటల పోటీలు ఏర్పాటు చేసి యువకుల దృష్టి క్రీడల వైపు మర్లించాలని, ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు మండల స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజోద్దీన్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలకు వివిధ గ్రామాలకు చెందిన 34 జట్లు హాజరవుతున్నట్లు తెలిపారు.

పోటీలను తిలకించిన ఎస్టీపీపీ ఈడీ

మండల కేంద్రంలో ప్రారంభమైన క్రికెట్ పోటీలను సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) రాజశేఖర్ రావు వీక్షించారు. రామారావుపేట్ గ్రామ పంచాయతీ దుబ్బపల్లి-కుందారం, నర్సింగాపూర్-మద్దులపల్లి మధ్య కొనసాగిన క్రికెట్ పోటీలను ఆయన ప్లాంట్ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి తిలకించారు. ఈడీని కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌కు చెందిన నాయకులు లింగారెడ్డి, వెంకటేష్‌గౌడ్, ఆవిడపు గణేష్, సారయ్య, పాపిరెడ్డి, శేఖర్, ఉస్కమల్ల రవి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించి అక్కడ కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలైన ఇన్కమ్ టాక్స్ చెల్లింపు, పనివేళల్లో మార్పు, గని ఉత్పత్తిలోని సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, జిల్లా సెక్రటరీ శ్యామ్ సుందర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, శ్రావణ్ పాల్గొన్నారు.

ప్రభావిత గ్రామాలపై దృష్టి సారించాలి

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ప్రభావిత గ్రామాల పట్ల సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్ అన్నారు. ఎస్టీపీపీ ప్రభావిత గ్రామం పెగడపల్లిని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించిన అధికారులు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడం బాధాకరమని అన్నారు. రిక్కుల సంతోష్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన ఆయన ఎస్టీపీపీ నుండి వెలువడుతున్న దుమ్ముధూళి పెగడపల్లి గ్రామాన్ని కప్పేసిందని అన్నారు. 2009 సంవత్సరంలో ఎస్టీపీ ఏర్పాటు కోసం చేపట్టిన భూసేకరణ సమయంలో ఇచ్చిన హామీలు అటుకెక్కించిన యాజమాన్యం 2018 సంవత్సరంలో ప్లాట్ విస్తరణ కోసం మరో మారు భూములను సేకరించిన రైతులను రోడ్డు పాలు చేసిందని ఆవేధన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు ప్లాంట్‌లో పర్మనెంట్ ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.5 వేల అలవెన్స్ చెల్లించడంతో పాటు యాజమాన్యం ఇక్కడ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పక్కనున్న పెగడపల్లి గ్రామాన్ని వదిలేసి సీఎస్ఆర్ నిధులు ఎక్కడెక్కడికో తరలిస్తున్నారని ఆరోపించారు. గ్రామస్తులకు మద్దతుగా హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 18న చేపట్టనున్న నిరసన సమ్మెకు అందరు మద్దతుగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ హెచ్ఎంఎస్ నాయకులు విక్రమ్, సాయికృష్ణారెడ్డి, చిప్పకుర్తి సంపత్, నవీన్, రాజు, సత్యనారాయణ చారి, రిక్కుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవచ సేవా సంస్థ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-మందమర్రి



సంక్రాంతి పండుగ పురస్కరించుకొని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌లో శ్రీవచ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ హాజరయ్యారు. సీఐ సతిమణి రజని, ఎస్ఐ సతిమణి హారిక ప్రియ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కె యశోద లక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మహిళలు, విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేశారు. ప్రథమ బహుమతి పట్టు చీరని బతుల సరిత, ద్వితీయ ఫ్యాన్సీ చీర, తృతీయ కోటా చీరలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా విజేతలకు అందచేశారు. ప్రథమ, ద్వితీయ, తృత బహుమతులను రాజయోగి షాపింగ్ మాల్ మందమర్రి యజమాని జి రాజు, కన్సోలేషన్ బహుమతులను పెట్రోల్ బంక్ యజమాని కె రమేష్, పార్టిసిపేట్ బహుమతులను జి మార్ట్ సూపర్ స్టోర్ యజమాని గంప ఆంజనేయుల సోదరులు స్పాన్సర్‌గా అందించారు. గొబ్బెమ్మలు, పులగం పాయసం, భోగిమంటలు, పతంగలతో పాఠశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. కుమారి లహరిప్రియ వేసిన భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శ్రీవచ సేవా సంస్థ అధ్యక్షుడు ఉప్పలంచి చంద్రకాంత్, లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల ప్రిన్సిపాల్ దామెర్ల రమ, దాసరి శ్రీకాంత్, మాచర్ల వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు రాచర్ల గణేష్, జనసేన నాయకులు మాయ రమేష్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు ఒడ్డే ఓబన్న

నవతెలంగాణ-నస్పూర్



సంచార జాతుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు ఒడ్డే ఓబన్న అని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పురుషోత్తం నాయక్ అన్నారు. శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒడ్డే ఓబన్న 218వ జయంతి కార్యక్రమంలో పాల్గొని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నేరటి రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, వడ్డెర కుల సంఘాల ప్రతినిధులతో కలిసి ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల చరిత్రను భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఒడ్డే ఓబన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమలో రేనాడు ప్రాంతంలో 1816 సంవత్సరం జనవరి 11వ తేదీన జన్మించి, 18వ శతాబ్దంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన అనుచరుడిగా సంచార జాతులకు నాయకత్వం వహించాడని, గెరిల్లా యుద్ధ పద్ధతిలో పోరాడాడని, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ దౌర్జన్యాలను ఎదుర్కొని తన జాతులను కాపాడుకున్న మహనీయుడు అని కొనియాడారు. ప్రభుత్వం ఓబన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్‌ను అడ్డుకున్న కాలనీ వాసులు

నవతెలంగాణ-మంచిర్యాల

కాలనిలో చెత్త డంప్ చేయొదంటూ చెత్తను డంప్ చేసేందుకు వచ్చిన మున్సిపల్ వాహనాలను అడ్డుకున్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని గోల్‌బంగ్లా బస్తి వాసులు కాలనీ సమీపంలో డంపింగ్ యార్డ్ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతుందని చెత్త డంప్‌తో అక్కడ ఉన్న శ్మశాన వాటిక కనుమరుగుగవుతుందన్నారు. మా కాలనీలో ఉన్న డంపింగ్ యార్డ్‌తో కాలనీ వాసులు అనారోగ్యానికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసులు విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సంఘటన స్థలానికి చేరుకొని స్థానికులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఇప్పటి నుండి ఇక్కడ చెత్తను డంప్ చేస్తే పెద్ద మొత్తంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

